## బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● ఆ పార్టీ అనంతగిరి మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి

అనంతగిరి, ఏప్రిల్ 19: వరంగల్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు నల్లా భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 24 ఏళ్లు పూర్తి చేసుకొని 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా రజతోత్సవ సభ జరుపుతున్నట్లు తెలిపారు. 27న గ్రామగ్రామాన బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి అనంతరం ర్యాలీగా కార్యకర్తలు, పార్టీ అభిమానులు, మండల కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అప్జల్, నాయకులు ఏడుకొండలు, పందిరి వీరయ్య, వెంకటప్పయ్య, వెంకటేశ్వర్లు, భూక్యా బోసు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు జాతరలా తరలిరావాలి

● బీఆర్ఎస్ నూతనకల్ మండలాధ్యక్షుడు మల్లయ్య


సమావేశంలో మాట్లాడుతున్న మున్న మల్లయ్య

నూతనకల్, ఏప్రిల్ 19: ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జాతరలా తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య కోరారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి బత్తుల సాయిల్‌గౌడ్, మాజీ సర్పంచ్ చూడి లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ గాడ్దుల లింగరాజు, నాయకులు బత్తుల విద్యాసాగర్, మొగుళ్ల వెంకన్న, బత్తుల విజయ్, మహేశ్వరం మల్లికార్జున్, ఉప్పుల వీరుయాదవ్, మూరగుండ్ల సైదులు, రేసు వెంకటేశ్వర్లు, కనకటి మహేశ్, వీరమల్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 'సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి'

మునగాల, ఏప్రిల్ 19: మండల కేంద్రం మునగాలలో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తొగరు రమేశ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న సమావేశంలో ముఖ్య అతిథిగా కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

## కేజీబీవీలో సహాయ వంట మనిషి పోస్టుకు దరఖాస్తులు

పాలకవీడు, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న సహాయ వంట మనిషి పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి ఇంజమూరి కాటయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మహిళలు మాత్రమే అర్హులని, దరఖాస్తుదారులు బయోడెటా ఫామ్, ఒక పాస్‌ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, 7వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, ఒకటి నుంచి ఏడో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. దరఖాస్తులను ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు కేజీబీవీలో ప్రత్యేకాధికారికి అందజేయాలని సూచించారు.

## డ్రగ్స్ నివారణపై నేడు అవగాహన సదస్సు

చివ్వెంల, ఏప్రిల్ 19: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని బీబీగూడెంలో డ్రగ్స్ నివారణపై ఆదివారం నిర్వహించనున్న అవగాహన సదస్సును విజయవంతం చేయాలని పీవై ఫౌండేషన్ చైర్మన్ పడిదల ప్రసాద్ కోరారు. బీబీగూడెంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌ను నియంత్రించేందుకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సుకు యువత, మేధావులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సామాజిక కార్యకర్తలు ఇట్టమల్ల మార్క్, యల్లయ్య, శేఖర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

● ఎంఈఓ సలీంషరీఫ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సలీంషరీఫ్

కోదాడ రూరల్, ఏప్రిల్ 19: కోదాడ పట్టణ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాల, కేఎస్ఎస్‌బీఎం బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ జోసెఫ్ సీసీ రెడ్డి పాఠశాలల్లో ఆదివారం నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎండీ.సలీంషరీఫ్ తెలిపారు. కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఇన్విజిలేటర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్, బాలుర ఉన్నత పాఠశాల, సీసీ రెడ్డి పాఠశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు హాల్ టికెట్లతో పాటు తప్పకుండా ఆధార్ కార్డు తీసుకురావాలని, లేనిపక్షంలో అనుమతించరని చెప్పారు. సమావేశంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ జి.రాజు, డిపార్ట్‌మెంటల్ అధికారి మార్కండేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కోదాడ రూరల్, ఏప్రిల్ 19: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండల పరిధిలోని కోమరబండ శివారులో ఎన్‌హెచ్ 65పై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామానికి చెందిన రైతు నేరేళ్ల సైదులు (55) తన కుమారుడితో కలిసి ట్రాక్టర్‌లో సూర్యాపేట మార్కెట్‌లో మామిడి కాయలు దింపి తిరిగి ఇంటికి బయలుదేరారు. కోమరబండ శివారులోని వై జంక్షన్ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టడంతో సైదులు అక్కడికక్కడే మృతిచెందారు. సైదులు కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపారు.

## 'సీజ్ చేసిన మోటార్లను తిరిగివ్వాలి'

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 19: నల్లాలకు మోటార్లు పెట్టామంటూ మున్సిపల్ అధికారులు సీజ్ చేసిన తమ మోటార్లను తిరిగివ్వాలని, తాము ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని పట్టణంలోని 43వ వార్డుకు చెందిన పలువురు మహిళలు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు మూడు రోజులకు ఒకసారి అరగంట పాటు నల్లా వస్తే ఆ నీళ్లు ఏ మాత్రం సరిపోవడం లేదని, వేసవి కాలం కావడంతో తీవ్ర మంచినీటి సమస్య ఎదుర్కొంటున్నామని తెలిపారు. సంపుల్లోని నీటిని పైన ట్యాంకులకు ఎక్కిస్తుంటే మున్సిపల్ అధికారులు వచ్చి నల్లాలకు మోటార్లు పెట్టి నీటి చౌర్యానికి పాల్పడుతున్నామని మోటార్లు గుంజుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బొమ్మకంటి రమణ, సూరపల్లి భాగ్య, స్వాతి, సౌడం సక్కుబాయి, రాధా రుక్మిణి, నీరజ, ఇందిర, భాగ్యమ్మ, సత్తెమ్మ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## చికెన్‌ను నిల్వ ఉంచిన రెస్టారెంట్‌కు జరిమానా

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 19: జిల్లా కేంద్రంలోని రామలింగేశ్వర థియేటర్ రోడ్డులో ఉన్న కింగ్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో పచ్చి చికెన్‌ను నిల్వ ఉంచినందుకు మున్సిపల్ అధికారులు శనివారం రూ.4 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేశ్, జవాన్లు కొండేటి వెంకన్న, పరుశురాములు, పోతుగంటి వేణు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల, ఏప్రిల్ 19: మండలంలోని దిర్శించర్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నందున నేరేడుచర్ల పట్టణంతో పాటు గ్రామాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# కేంద్రాలు తెరిచారు.. కొనుగోళ్లు మరిచారు

- శూన్యపహాడ్, పాలకవీడులో పది రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- నేటికీ క్వింటా కూడా కొనుగోలు చేయని దుస్థితి
- కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న రైతులు


శూన్యపహాడ్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనకపోవడంతో ట్రాక్టర్లకు ఎత్తుతున్న రైతులు

పాలకవీడు, ఏప్రిల్ 19: ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు పంటలను అమ్మడానికి తిప్పలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో రకరకాల కొర్రీలు పెడుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 9న మండలంలోని శూన్యపహాడ్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో, 10న మండల కేంద్రం పాలకవీడులో వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో అధికారులు కొనుగోలు కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభించారు. అయితే, ఇప్పటి వరకు ఆయా కేంద్రాల్లో కనీసం ఒక్క క్వింటాను కూడా అధికారులు కొనుగోలు చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో పాటు బోనస్ వస్తుందని ఆశపడ్డామని, ఇప్పుడు అసలు కొనుగోళ్లే చేయడం లేదని వాపోతున్నారు. మరోవైపు వాతావరణం అనుకూలించకపోవడం, అకాల వర్షాలు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారని చెబుతున్నారు. మళ్లీ రెండు రోజులు వర్షాలు ఉన్నాయన్న వార్తల నేపథ్యంలో రైతులు మరింత భయపడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు మాయమాటలు చెప్పడం తప్ప ధాన్యం కొనుగోలు చేసే ప్రయత్నం చేయడం లేదని విమర్శిస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక పలువురు రైతులు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని తిరిగి ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలిస్తున్నారు.

**తేమ శాతం అధికంగా ఉండడంతో..**

కాగా, ఈ విషయమై ఏపీఎం దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా ధాన్యంలో తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉండడంతో కొనుగోలు చేయడం లేదని తెలిపారు. తేమ శాతం తక్కువ వస్తే వెంటనే కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పారు.

### తేమ శాతం సాకుతో కొనట్లేదు



తేమ శాతం అధికంగా ఉందన్న సాకుతో మా గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఒక్క బస్తా కొనలేదు. చేసేదేమీ లేక కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యాన్ని తిరిగి ట్రాక్టర్ ద్వారా మిల్లులకు తరలించి అమ్ముకుంటున్నాం.

**- రమావత్ అమర్‌సింగ్, రైతు, శూన్యపహాడ్ గ్రామం**

### రైతులను మోసం చేస్తున్నారు



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను మోసం చేస్తున్నారు. ఇంత వరకు ఒక్క బస్తా కూడా కొనలేదు. ఏమైనా అంటే తేమ శాతం అధికంగా ఉందంటున్నారు. 10 రోజులైనా వడ్లలో ఇంకా తేమ ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ఇక్కడ ఆశలు వదులుకొని ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నం.

**- రమావత్ పీకీ, రైతు, శూన్యపహాడ్ గ్రామం**

### నిబంధనల మేరకు కొనుగోళ్లు

పాలకవీడు మండలంలో రెండు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు ధాన్యం కొనకపోవడం వాస్తవమే. తేమ శాతం ఎక్కువగా ఉండడమే జాప్యానికి కారణం. నిబంధనల మేరకు కొనుగోళ్లు చేపడతాం.

**- కల్యాణచక్రవర్తి, ఏఓ**

## రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు రుణ సదుపాయం కల్పించాలి

● బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఏప్రిల్ 19: రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రుణ సదుపాయం కల్పించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ బ్యాంకర్లను కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ పథకానికిం 60,502 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారి నుంచి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు. దివ్యాంగులకు ఐదు శాతం అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌నాయక్, డీఆర్‌డీఓ అప్పారావు, డీటీడీఓ శంకర్, డీఎండబ్ల్యూ జగదీశ్వర్‌రెడ్డి, బ్యాంక్ అధికారులు నాగబాబు, రవి, సురేశ్, కల్యాణ్, రాజేశ్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ రాంబాబు


ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 19: కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. పట్టణ పరిధిలోని పిల్లలమర్రిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తాలు లేకుండా, 17 శాతం తేమ ఉండేలా నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. అనంతరం కొనుగోళ్లకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ


ఓ ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

సూర్యాపేట, ఏప్రిల్ 19: జిల్లా కేంద్రం సూర్యాపేటలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను జిల్లా వైద్యాధికారి కోటాచలం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రుల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ బృందం అనిత, శ్రీశైలం, మనోహరాణి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుమారుడుతో సహా తల్లి అదృశ్యం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 19: కుమారుడితో సహా మహిళ అదృశ్యమైన ఘటన హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన పిట్టల గోపి, రమ్య దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. శుక్రవారం సాయంత్రం కుమారుడు నవీన్‌తో కలిసి బయటకు వెళ్లిన రమ్య తిరిగి ఇంటికి రాలేదు. దీంతో రమ్య భర్త గోపి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ బలరాంరెడ్డి తెలిపారు.

**మఠంపల్లి మండలంలో ఇద్దరు అదృశ్యం**

మఠంపల్లి: మఠంపల్లి మండలంలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. మండల కేంద్రానికి చెందిన కందుల వెంకన్న అనే వ్యక్తి ఈ నెల 15న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో వెంకన్న భార్య నాగలక్ష్మి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బాబు తెలిపారు. అదేవిధంగా మండలంలోని మంచ్యాతండాకు చెందిన సపావత్ పున్న ఈ నెల 5న అదృశ్యమయ్యాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పున్న తండ్రి తారాసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాబు వెల్లడించారు.

## 'మేడే వేడుకలను జయప్రదం చేయాలి'

నేరేడుచర్ల, ఏప్రిల్ 19: ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన మేడేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను కోరారు. మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో శనివారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేడుకల్లో అన్ని సంఘాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని అన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు అల్వాల శ్రీధర్, మామిడి నాగసైదులు, కట్ట మధుబాబు, మచ్చ సోమయ్య, చలసాని అప్పారావు, బొప్పన సులోచనరాణి, ధనుంజయ, శ్రీనివాస్, ఆరె వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాఘవాపురంలో పశు వైద్య శిబిరం

పాలకవీడు, ఏప్రిల్ 19: మండలంలోని రాఘవాపురం గ్రామంలో నేరేడుచర్ల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించడంతో పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై చెత్త వేసినందుకు జరిమానా

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 19: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద రోడ్డుపై చెత్త వేసినందుకు మున్సిపల్ అధికారులు ఓ దుకాణదారుడికి రూ.1000 జరిమానా విధించారు. కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ సమీపంలో చెత్త పేరుకుపోయి ఉండడంతో శనివారం మున్సిపల్ అధికారులు అక్కడకు చేరుకొని కొబ్బరికాయల దుకాణదారుడు వెలుగు వెంకన్నకు జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేశ్, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

## 'స్వేచ్ఛను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం'

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 19: రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలు సమానమనే భావనను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విస్మరించి ముస్లిం మైనార్టీలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని రిటైర్డ్ ఎస్ఐ షేక్ అబ్దుల్లా, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి, ముస్లిం మైనార్టీ నాయకుడు ముఫ్తీ అస్రార్ సాహెబ్ అన్నారు. ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని మమత బాంకెట్ హాల్‌లో జరుగనున్న 'వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం' అనే సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో శనివారం ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో రఫీయోద్దీన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

నాగారం, ఏప్రిల్ 19: పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఫణిగిరి గ్రామానికి వట్టె భద్రమ్మ (60) తన చిన్న కుమారుడు పుల్లయ్య కుటుంబంతో కలిసి ఉంటుంది. గ్రామంలో తమకున్న వ్యవసాయ పొలంలో పుల్లయ్య వరి పండించాడు. అయితే వరి కోసేందుకు వెళ్లగా పుల్లయ్య అన్న భార్య అయిన విజయ ఆస్తి తగాదాల నేపథ్యంలో అడ్డుకుంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో చిన్న కుమారుడికి అన్యాయం జరుగుతుందని మనస్తాపానికి గురైన భద్రమ్మ శనివారం ఉదయం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, ఈ విషయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కల్పించుకొని వరి కోత మిషన్ పొలంలోకి రాకుండా అడ్డుకొని తమను ఇబ్బందులకు గురి చేశారని పుల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై సీఐ రఘువీర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి, ఏప్రిల్ 19: భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి భూ భారతి చట్టంపై శనివారం తిరుమలగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలపై మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే నిర్ధేశించిన సమయంలో ఆయా మండలాల తాసీల్దార్లు ఆ సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. రైతులను రెవెన్యూ అధికారులు ఏమైనా ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని పేర్కొన్నారు. సదస్సులో అదనపు కలెక్టర్ రాంబాబు, తాసీల్దార్ హరిప్రసాద్, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చామంతి, ఏఓ నాగేశ్వర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

చిలుకూరు, ఏప్రిల్ 19: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. చిలుకూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారంతో రక్తహీనతను నియంత్రించొచ్చని తెలిపారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ పీడీ నరసింహారావు, తాసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ నరసింహారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

నేరేడుచర్ల, ఏప్రిల్ 19 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి నేడు నిర్వహించే పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు పరీక్ష కేంద్రం సీఎస్ శ్రీనివాస్, డీఓ అనుకరణ తెలిపారు. ఈ మేరకు శనివారం మండలంలోని చిల్లేపల్లి బీసీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. చిల్లేపల్లి కేంద్రంలో మొత్తం 240 విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కోరారు.


## 'పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పాటుపడాలి'

కోదాడ రూరల్, ఏప్రిల్ 19: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పాటుపడాలని మండల విద్యాధికారి ఎండీ.సలీంషరీఫ్ అన్నారు. కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు నాటిన వివిధ రకాల మొక్కలను శనివారం ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

● ఇమాంపేట వద్ద రైతులతో కలిసి రాస్తారోకో


ఇమాంపేట వద్ద రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 19: ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతులతో కలిసి మండల పరిధిలోని ఇమాంపేట హెచ్‌పీఎల్ వద్ద సూర్యాపేట -నేరేడుచర్ల రహదారిపై సీపీఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇమాంపేటలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి రోజుల తరబడి ఎదురు చూస్తున్నా అధికారులు జాప్యం చేస్తున్నారని అన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సివిల్ సప్లై అధికారులు, తాసీల్దార్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దండా వెంకట్‌రెడ్డి, సీపీయం నాయకులు శేఖర్, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో 'రన్ ఫర్ జీసస్'


సూర్యాపేటలో రన్ ఫర్ జీసస్ నిర్వహిస్తున్న క్రైస్తవులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 19: ఏసు క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకాలని సూర్యాపేట సెంటినరీ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎం.ప్రభుదాస్ అన్నారు. సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో సూర్యాపేటలోని ప్రధాన వీధుల గుండా శనివారం 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు క్రీస్తు చూపిన శాంతి, ప్రేమ, అహింస మార్గాలు సర్వ మానవాళి పాటించాలన్నారు. కార్యక్రమంలో జాన్ సుమిత్ర, మార్క్ పోలోనియన్, జెఫన్యా, వల్దాస్ ఉపేందర్, హ్యూబర్ట్, మర్రి నెహమ్యా, సుందర అబ్రహం తదితరులు పాల్గొన్నాయి.

## అమృత్ పనులను త్వరగా పూర్తి చేయాలి

● నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా, ఏప్రిల్ 19 : హాలియా మున్సిపాలిటీలో అమృత్ పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం హాలియా మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి అమృత్ పథకం కింద చేపట్టిన పనులపై ఆమె సమీక్ష నిర్వహించారు. పనుల్లో పురోగతి ఆశించినంతగా లేదని కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సత్యనారాయణ, డీఈ మనోహర, ఏఈ సురేశ్, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ


హన్షిత శ్రీ


బిందు మాధవి


జి.తేజశ్రీ


బి.శివమణి


కన్నా ఉజ్వాన్

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 19: జిల్లా కేంద్రంలోని జయ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం కళాశాలలో అభినందించి మాట్లాడారు. జయ కళాశాల నుంచి 58 మంది ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ అర్హత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు కన్నా ఉజ్వాన్, జి.తేజశ్రీ, వి.బిందు మాధవి, హన్షిత శ్రీ, బి.శివమణి, జె.మేనక, డి.జగదీశ్‌రాజు, పి.ప్రేమ్‌చంద్ ఆలిండియా ర్యాంకులు సాధించినట్లు చెప్పారు.

## ఆర్థిక సాయం

గుర్రంపోడ్, ఏప్రిల్ 19: మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బల్గూరి శేఖర్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు (1999-2000 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు) శనివారం గ్రామానికి వెళ్లి శేఖర్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 35,300 ఆర్థిక సాయం అందించారు.